# ఉచిత సీటు హుళక్కే!



విద్యార్థికి ఫ్రీ సీటు కేటాయించినట్లు సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్

- మధురానగర్ పొలాక్స్ ప్రైమరీ స్కూల్‌లో 15 మందికి ఫ్రీ సీట్ల కేటాయింపు
- ఆర్‌టీఈ యాక్ట్ ప్రకారం అలాట్‌మెంట్
- గడువు ముగిసినా అడ్మిషన్లు ఇవ్వకుండా తిప్పుతున్న స్కూల్ మేనేజ్‌మెంట్
- ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు.. స్కూల్ సిబ్బందితో వాగ్వాదం
- ఎంఈవోలు జోక్యం చేసుకున్నా.. కనిపించని ఫలితం


పొలాక్స్ స్కూల్ సిబ్బందిని నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**సీతంపేట:** విద్యా హక్కు చట్టం(ఆర్‌టీఈ) ప్రకారం ప్రభుత్వం బీపీఎల్ కుటుంబాలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫ్రీ సీట్లు కేటాయించినప్పటికీ.. స్కూల్ మేనేజ్‌మెంట్ మాత్రం అడ్మిషన్లు ఇవ్వకుండా కాళ్లరిగేలా తిప్పుతున్నారని విద్యార్థుల తల్లిదండులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మధురానగర్‌లోని పొలాక్స్ ప్రైమరీ స్కూల్‌లో ఆర్‌టీఈ యాక్ట్ ప్రకారం మొదటి రౌండ్‌లో సుమారు 10 మందికి, రెండో రౌండ్‌లో ఐదుగురికి ప్రభుత్వం సీట్లు కేటాయించినట్టు తల్లిదండ్రుల ఫోన్‌కు విద్యా శాఖ నుంచి మెసేజ్‌లు వచ్చాయి. దీని ప్రకారం ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకునేందుకు సీట్లు కేటాయించాల్సి ఉంది. మొదటి లిస్టులో సీటు అలాట్‌మెంట్ వచ్చిన వారికి ఈ నెల 10లోగా, రెండో లిస్టులో వచ్చిన వారికి ఈ నెల 28 లోగా సీట్లు కేటాయించి జాయిన్ చేసుకోవాల్సి ఉంది. సీటు అలాట్ అయినట్టు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చిన నాటి నుంచి తల్లిదండ్రులు పాఠశాల చుట్టూ తిరుగుతున్నారు. వారు అడిగిన పత్రాలు అందజేశారు. స్కూల్ యాజమాన్యం మాత్రం ఫ్రీ సీటు ఇవ్వకుండా వారిని తిప్పుతున్నారు.

**స్కూల్ సీఈవో చేతిలో ఉందట..**

ఫ్రీ సీటు గడువు శనివారంతో ముగియడంతో తల్లిదండ్రులు మధురానగర్ పొలాక్ స్కూల్‌కు వచ్చి ఆఫీస్ సిబ్బందిని నిలదీశారు. ప్రభుత్వం ఫ్రీ సీటు కేటాయించినా తమ పిల్లలను ఎందుకు చేర్చుకోరని వాగ్వాదానికి దిగారు. ఫ్రీ సీటు కేటాయింపు నిర్ణయం స్కూల్ సీఈవో చేతిలో ఉందని, సిబ్బంది చేతిలో ఏమీ లేదని చేతులెత్తేయడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు ఎంఈవోలు బాలామణి, రామారావుకు ఫిర్యాదు చేశారు. వారిద్దరూ పాఠశాలకు చేరుకుని సిబ్బందితో చర్చించారు. అన్ని స్కూళ్లు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫ్రీ సీట్లు కేటాయిస్తున్నాయని, మీరు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సీటు ఇవ్వని పక్షంలో రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. సీఈవో సోమవారం వస్తారని, అప్పుడే రావాలని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు నిరాశగా ఇంటిబాట పట్టారు.

### సీటు ఇవ్వకుండా తిప్పడం అన్యాయం



మా పాప యశస్వి కోసం ఏప్రిల్ 4న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాం. జూన్ 21న సెకెండ్ లిస్ట్‌లో పొలాక్స్ స్కూల్‌లో ఫ్రీ సీటు అలాట్ అయినట్టు ఫోన్‌కి మెసేజ్ వచ్చింది. అప్పటి నుంచి స్కూల్‌కి తిరుగుతున్నాను. వాళ్లడిగిన పత్రాలు అన్నీ ఇచ్చాను. గడువు సమీపించే సరికి మీరు కంచరపాలెం బర్మా క్యాంప్‌లో ఉంటున్నారు. 5 కిలో మీటర్లు దూరం దాటితే సీటు రాదని చెబుతున్నారు. ప్రభుత్వం సీటు ఎలాట్ చేసినా ఏవో కారణాలు చూపించి సీటు ఇవ్వకుండా తిప్పడం అన్యాయం.

– గంటా విజయ, విద్యార్థిని తల్లి, బర్మా క్యాంప్

### సీట్లు కేటాయించి న్యాయం చేయండి



నగరంలోని చాలా స్కూళ్లలో ఫ్రీ సీట్లు కేటాయించారు. మధురానగర్ పొలాక్స్ స్కూల్‌లో మాత్రం సీట్లు ఇవ్వడం లేదు. గడువు ముగిసినా మొదటి లిస్టులో వారికి సీట్లు ఇవ్వలేదు. రెండో లిస్టు గడువు కూడా శనివారంతో ముగిసింది. ఒకవేళ సీటు ఇచ్చినా నాలుగో తరగతి వరకే అని స్కూల్ సిబ్బంది చెబుతున్నారు. అన్ని స్కూళ్లు ఒకటి నుంచి పదో తరగతి వరకు సీట్లు ఇస్తున్నాయి. అధికారులు చొరవ తీసుకుని సీట్లు కేటాయించి న్యాయం చేయాలి.

– కె.కనకలత, విద్యార్థి తల్లి, అల్లిపురం

### స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి



మా బాబు కేయాన్ష్‌కు రెండో లిస్టులో పొలాక్స్ స్కూల్‌లో ఫ్రీ సీటు వచ్చినట్టు మెసేజ్ వచ్చింది. స్కూల్‌కు వెళ్తే శనివారంతో గడువు ముగిసిపోయిందన్నారు. స్కూల్ సీఈవో ఫోన్ ఎత్తడం లేదు. నిర్ణయం ఆయనే తీసుకోవాలి, మా చేతిలో ఏమీ లేదని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం సీటు కేటాయించినా స్కూల్ మేనేజ్‌మెంట్ మాత్రం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసకుని, గుర్తింపు రద్దు చేయాలి.

– పి.గోవిందరావు, విద్యార్థి తండ్రి, అక్కయ్యపాలెం

## వైభవుడికి విశేష పూజలు



**మురళీనగర్:** కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతుల సమ ర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## వెంకటేశ్వర కాలనీలో అన్నసంతర్పణ


అన్నప్రసాదం వడ్డిస్తున్న బానాల శ్రీనివాసరావు

**సీతంపేట:** జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో కొలువైన శ్రీ భూ సమేత వరద వేంకటేశ్వర స్వామి ఆలయ 19వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీవెంకట తారకరామా సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం అన్నసంతర్పణ నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు భక్తులను అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నీటి కష్టాలపై మహిళల నిరసన


నిరసన ర్యాలీ చేస్తున్న జాకీర్ హుస్సేన్‌నగర్ మహిళలు

**మర్రిపాలెం:** జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిబ్బంది సమ్మె చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జీవీఎంసీ 51, 53 వార్డుల్లో పలు చోట్ల నీటి సరఫరా ఆగిపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాధవధార వుడా కాలనీ పంప్ హౌస్ వద్ద, మర్రిపాలెం జాకీర్ హుస్సేన్ వద్ద మంచినీటి సమస్యను పునరుద్ధరించాలని నిరసనలు తెలియజేశారు. నీరు లేక పోవడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్టు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున మహిళలు రోడ్డుపై ర్యాలీ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. శనివారం అధికారులతో చర్చలు సఫలమవ్వడంతో నీటి సరఫరా విభాగం కార్మికులు సమ్మె విరమించారు.

### మంచినీటి పైపుల లీకేజీ


మహారాణి పార్లర్ వద్ద లీకవుతున్న నీరు

**సీతంపేట:** అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో మహారాణి పార్లర్ వద్ద మంచినీటి పైపులు లీకవుతున్నాయి. పైపులకు రంధ్రాలు పడటంతో మూడు చోట్ల నుంచి నీరు నెమ్మదిగా లీకవుతూ రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల తారురోడ్డు కింద ఉన్న పైపులు పగలడం గాని రంధ్రాలు పడటం గాని జరిగి నీరు లీకయ్యే అవకాశముందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

### గొయ్యి పూడ్చిన అపార్ట్‌మెంట్ వాసులు


శంకరమఠం రోడ్‌లో కాంక్రీట్‌తో పూడ్చిన గొయ్యి

**సీతంపేట:** శంకరమఠం రోడ్‌లో విజయ గణపతి ఆలయం వద్ద ఏర్పడిన గోతిని అక్కడ ఉన్న సూర్య అపార్టుమెంట్‌లో నివసిస్తున్న వారంతా కలిసి కాంక్రీట్‌తో పూడ్చారు. ఇక్కడ గొయ్యి ప్రమాదకరంగా ఉండటంతో ఈ నెల 25వ తేదీన సాక్షిలో 'ప్రమాదకరంగా గొయ్యి' శీర్షికన వార్త ప్రచురితమైంది. అయినా జీవీఎంసీ యంత్రాంగం స్పందించలేదు. గొయ్యి వల్ల వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతుండటంతో, పక్కనే ఉన్న సూర్య అపార్టుమెంట్ వాసులు అందరూ కలిసి అపార్టుమెంట్ వాచ్‌మన్ చేత గొయ్యి పూడ్చించారు. అపార్ట్‌మెంట్ వాసుల సేవా భావాన్ని పలువురు ప్రశంసించారు.

### రాంజీ ఎస్టేట్‌లో పేదలకు అన్నదానం


అన్నం వడ్డిస్తున్న గొల్లమాల అప్పారావు

**కంచరపాలెం:** స్థానిక కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో పేదలకు శనివారం అన్నసమారాధన నిర్వహించారు. దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు గొల్లమాల అప్పారావు అన్నదానం చేశారు. సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని గొల్లమాల అప్పారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి వెంకటరావు, భీర భైరవ మూర్తి, బొత్స అప్పారావు, టీకి గణేష్, అన్ను సుబ్రమణి, నీళ్ల గణేష్, ధనాల అప్పారావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## శారదా పీఠం భూములు రాందేవ్ బాబాకు కట్టబెడతారా?

విదసం ఆక్షేపణ


మాట్లాడుతున్న బూసి వెంకటరావు

**సీతమ్మపేట:** శారదా పీఠం భూములు తిరిగి రాందేవ్ బాబాకు కేటాయిస్తే అంగీకరించే ప్రసక్తి లేదని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం భూ కేటాయింపుల ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం అంబేడ్కర్ భవన్‌లో జాజి ఓంకార్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన విదసం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా, ముఖ్యంగా భీమిలి మండలంలో శారదా పీఠానికి ఇచ్చి, రద్దు చేసిన విలువైన భూముల కోసం రాందేవ్ బాబా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ భూములను అట్టడుగు వర్గాల విద్యార్థుల భవిష్యత్తు కోసం విదసం పోరాడి కాపాడిందన్నారు. చంద్రబాబు ఇలాంటి బాబాలకు భూ కేటాయింపులు చేస్తే పోరాటం చేస్తామన్నారు. రాందేవ్ బాబా కార్యకలాపాల్లో నిజాయితీ, నైతికత లేదని సుప్రీంకోర్టు చివాట్లు పెట్టిన సంగతి రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని భూ కేటాయింపులు ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభాధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలకు డిమాండ్ చేస్తూ జులై 3న విదసం మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బత్రె అప్పారావు, గుడివాడ ప్రసాద్, బూల భాస్కర రావు, కస్తూరి వెంకటరావు, డి.నిర్మల, రవి శేఖర్, బంటు కృష్ణారావు, వడ్లమూరి ఫ్రాన్సిస్, బండి హేనా పాల్గొన్నారు.

## రోడ్డుపైనే కాంక్రీట్ పిక్క


జాతీయ రహదారి నుంచి వివేకానంద వీధికి వెళ్లే మార్గంలో పిక్క

**కంచరపాలెం:** జీవీఎంసీ 54వ వార్డు వివేకనందవీధి జాతీయ రహదారి నుంచి కంచరపాలెం టీఆర్‌టీఎస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో కాంక్రీట్ పిక్కను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇటీవల జోన్-5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారు. అనంతరం కాంక్రీట్ పిక్కను రోడ్డుపైనే వదిలేయడంతో అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు పిక్కను అలా నిర్లక్ష్యంగా వదిలేశారని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, కాంక్రీట్ పిక్కను తరలించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## పోలీసులపై ఆరోపణలు సరికాదు


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

**తాటిచెట్లపాలెం:** దొండపర్తిలోని మిరాజ్ సినిమాస్ యాజమాన్యంపై ఇచ్చిన ఫిర్యాదు మీద చర్యలు తీసుకోలేదని పోలీసులపై ఆరోపణలు చేయడం సరికాదని, ఇది పూర్తిగా లేబర్ డిపార్ట్‌మెంట్‌కు చెందినదని వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 28న మిరాజ్ సినిమాస్ యాజమాన్యంపై తమకు ఫిర్యాదు చేశారని, దానిపై చర్యలు వద్దని 31వ తేదీన బాధితులు ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారని చెప్పారు. కులం పేరుతో దూషించారని పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపణలు చేస్తున్నారని, అవి ఎదుర్కొంటున్న మహిళ కూడా ఎస్సీ యువతి అని తెలిపారు. ఎందుకు చర్యలు తీసుకోలేదో అడుగకుండానే, మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారం చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు. ఉద్యోగాలు తొలగించారనే ఫిర్యాదు లేబర్ డిపార్ట్‌మెంట్ పరిష్కరించాల్సిన సమస్యని, దీనిలో కులం ప్రసక్తి లేదని, అనవసరంగా పోలీసులపై ఆరోపణలు చేయడం సరికాదని చెప్పారు. పది మంది సంతకాలు పెట్టి తమకు ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకున్నారని, ఈ కాపీని మీడియాకు ఏసీపీ చూపించారు. ఇరువురు ఎస్సీ, ఎస్టీకి చెందిన వారు కాబట్టి అట్రాసిటీ కేసు వర్తించదని వివరణ ఇచ్చారు. సమావేశంలో ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రేక్షకులకు మంచి సినిమా అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఫిల్మ్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ శశిధర

**తాటిచెట్లపాలెం:** ప్రేక్షకులకు మంచి సినిమాను అందించడమే ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ముఖ్య ఉద్దేశమని సొసైటీ సదరన్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ శశిధర అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సీతమ్మధారలోని ఓ ప్రైవేట్ హాల్లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రెండేళ్లలో చేపట్టబోయే కార్యక్రమాలు, జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణ, సొసైటీ బలోపేతానికి తీసుకోవలసిన అంశాలపై చర్చించారు. ఆంధ్ర తెలంగాణ, బెంగళూరు ప్రాంతాల్లో మంచి సినిమాలు ప్రోత్సహించడమే లక్ష్యంగా దక్షిణాది రాష్ట్రాల ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రాబోయే కాలంలో విశాఖ వేదికగా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా 35 చిత్రంలో ఉత్తమ బాల నటుడిగా గద్దర్ అవార్డు అందుకున్న నటుడిని ఫిల్మ్ సొసైటీ తరపున సత్కరించారు. కార్యక్రమంలో వీఎఫ్ఎస్ అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ బి.చిన్నారావు, ఫెడరేషన్ సెక్రటరీ ప్రకాష్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శేషాద్రి, ట్రెజరర్ మహేష్ ఫిల్మ్, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ఉషా రాణి, ట్రెజరర్ హుస్సేన్, జాయింట్‌సెక్రటరీ బాబూరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఆర్ శివకుమార్, గణేశ్వర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

**మురళీనగర్:** మురళీనగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.హేమలత అధ్యక్షతన, వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్-101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఆర్‌సీ-5 యు.సుభ, దాతల చేతుల మీదుగా పది మంది విద్యార్థులు, ఇద్దరు దివ్యాంగులకు నగదు పురస్కారాలు, నోట్ పుస్తకాలు, పెన్‌లు పంపిణీ చేశారు. వనితా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు వి.జయప్రభ శర్మ ఆరు నుంచి పదో తరగతి వరకు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రూ.10 వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## యాచకుడి మృతి


యాచకుడి మృతదేహం వద్ద పరిశీలిస్తున్న ద్వారకా పోలీసులు

**తాటిచెట్లపాలెం:** డైమండ్ పార్క్ సమీపంలో ఓ వ్యక్తి ఆకస్మికంగా మృతిచెందాడు. ద్వారకా పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. డైమండ్ పార్క్ సమీపంలో భిక్షాటన చేసుకుంటూ, చెత్త కాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్లు సేకరిస్తూ జీవిస్తున్న ముప్పా దుర్గాప్రసాద్(35) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో ద్వారకానగర్ 2వ లేన్ ప్రాంతంలోని రెడ్నం మేనర్ హోటల్ ఎదురుగా గల ఫుట్‌పాత్‌పై మరణించాడు. ఇతడు పది రోజులుగా పచ్చకామెర్లతో బాధపడుతున్నట్లు ఇతడితో కలిసి భిక్షాటన చేసుకునే వారు తెలియజేశారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరచినట్లు, మృతుడి సంబంధీకులు, బంధువులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని ద్వారకా పోలీసులు కోరారు. హోటల్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అపూర్వం.. 55 ఏళ్ల స్నేహబంధం


ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కలుసుకున్న బొబ్బిలి ప్రభుత్వ పాఠశాల 1970 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

**సీతంపేట :** బొబ్బిలి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 1970లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కలుసుకున్నారు. వీరిలో చాలా మంది విశాఖలో స్థిరపడిన వారు కావడం విశేషం. ప్రతి ఏటా బొబ్బిలిలో కలుసుకుంటున్నామని, ఈసారి విశాఖలో కలుసుకున్నామని వారు తెలిపారు. టెన్త్‌తోపాటు 1972లో ఇంటర్, 1976లో డిగ్రీ అందరం కలిసి చదివామని, తర్వాత డాక్టర్లు, ఇంజినీర్లు, టీచర్లు, బ్యాంకు మేనేజర్లుగా వివిధ హోదాలు పనిచేసి ప్రస్తుతం తమ బ్యాచ్ అంతా పదవీ విరమణ పొంది 70 ఏళ్ల ప్రాయంలో ఉన్నవారే. సుమారు 30 మంది పూర్వ విద్యార్థులు కలుసుకుని యోగక్షేమాలు ముచ్చటించుకున్నారు. పిల్లలు కూడా సెటిల్ కావడంతో ప్రతి ఒక్కరూ సోషల్ సర్వీస్‌లో పాల్గొంటూ తమకు చేతనైన సాయం సమాజానికి చేస్తున్నామని తెలిపారు. బొబ్బిలి ఫ్రెండ్స్ పేరిట వాట్సాప్‌లో గ్రూప్‌లో అందరం ప్రతి రోజూ చాటింగ్, యోగ క్షేమాలు తెలుసుకుంటూ 55 ఏళ్ల స్నేహాన్ని ఇంకా కొనసాగించడం ఎంతో ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు చెప్పారు.

## పీవీ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

పుస్తకావిష్కరణ సభలో ఎమ్మెల్యే కొణతాల


పీవీ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

**సీతంపేట:** భారత రత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. పీవీ 104వ జయంతి సందర్భంగా విశాఖలోని పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన పీవీ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. దేశ, విదేశాల మేధావులు, సాహితీకారులు, ప్రజలచే కొనియాడబడిన అపర చాణుక్యుడు, రాజనీతిజ్ఞుడు పీవీ అన్నారు. ఏయూ విశ్రాంత ఆచార్యులు కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ తెలుగు వారంతా పీవీ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 16 భాషల్లో ప్రావీణ్యం కలిగి ఉండడమే కాకుండా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రపంచ ప్రసిద్ధి చెందారని వివరించారు. గ్రంథకర్త భాగవతుల శంకర్ నీలు మాట్లాడుతూ పీవీ ప్రధానిగా పదవీ విరమణ అనంతరం కాంగ్రెస్ పార్టీ చేసిన ఘోర అవమానాలు కలిచివేసి, పీవీ గొప్పదనాన్ని తెలుగు వారికి తెలియజేయడం కోసం తెలుగులో ఆయన జీవిత చరిత్ర రాసినట్లు చెప్పారు. విశాఖలో గ్రంథం ఆంగ్ల అనువాదం ఆవిష్కరించామన్నారు. పీవీ జీవిత చరిత్రను ఆంగ్లంలో రచించిన కె.సత్యనారాయణ మూర్తి తన అనుభవాలను సభలో పంచుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పూర్వ వీసీ డాక్టర్ బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలనే సంకల్పంతో కేంద్రంలో మానవ వనరుల శాఖను పీవీ ఏర్పాటు చేశారని చెప్పారు. పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ అధికారి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ భారతదేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో మైనారిటీ ప్రభుత్వాన్ని ఎంతో సమర్థవంతంగా పూర్తి కాలం నడిపించడమే కాక, ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘ ప్రతినిధులు, సాయిరామ్ సీవీఎస్, వడ్డాది ఉదయ్ కుమార్, వి.జగన్ మోహన్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.